క్లుప్తంగా

డిగ్రీ సెమిస్టర్ పరీక్షల్లో 93 శాతం హాజరు నమోదు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో గురువారం జరిగిన డిగ్రీ సెమిస్టర్ పరీక్షలకు 93 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు వర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం సెషన్‌లో జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలకు 2,131 మందికి 1932 మంది, స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలకు 9 మందికి 8 మంది, మధ్యాహ్నం సెషన్‌లో జరిగిన ఆరవ సెమిస్టర్ పరీక్షలకు 913 మందికి 852 మంది విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. కర్నూలు సెయింట్ జోసఫ్స్ డిగ్రీ కళాశాలలో 2, నంద్యాల ఎస్పీవై రెడ్డి డిగ్రీ కళాశాలలో 2, నంద్యాల పీఎస్‌సీ అండ్ కేవీఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, హనుమాపురం నలంద డిగ్రీ కళాశాల, నంద్యాల శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో ఒక్కొక్కరు చొప్పున మొత్తం ఏడుగురు విద్యార్థులు చూచిరాతలకు పాల్పడగా డిబార్ చేసినట్లు తెలిపారు.

పుస్తకాలు ముద్రిస్తున్న స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.అబ్దుల్లా

కర్నూలు(సెంట్రల్): నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు వాటి పేరిట పుస్తకాలు ముద్రించి విద్యార్థులకు విక్రయిస్తున్నా విద్యాశాఖ పట్టించుకోవడంలేదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.అబ్దుల్లా పేర్కొన్నారు. గురువారం సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలు మాఫియాగా ఏర్పడి అవసరం లేకున్నా విద్యార్థులకు పుస్తకాలు కట్టబెట్టి కోట్ల రూపాయలు దండుకుంటున్నాయన్నారు. యథేచ్ఛగా పాఠశాలల పేరిట ముద్రించిన పుస్తకాలు విక్రయిస్తున్నా డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు తొంగి చూడడంలేదన్నారు. ఎల్‌కేజీ విద్యార్థికి కనీసం 4 వేలు పుస్తకాల కోసమే వసూలు చేస్తున్నారన్నారు. పదో తరగతి విద్యార్థికి అయితే 12 వేల వరకు వసూలు చేసి తల్లిదండ్రులకు తీవ్ర భారంగా మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు సాయి ఉదయ్, అమర్ బాబు పాల్గొన్నారు.

ఆ టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

కర్నూలు సిటీ: సాధారణ ఎన్నికల విధులకు ఆరోగ్య కారణాలు, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా హాజరుకాలేకపోయి సస్పెండ్‌కు గురైన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఏపీటీఎఫ్ నాయకులు గురువారం డీఈఓ కె.శామ్యూల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు మాట్లాడుతూ ఎన్నికల శిక్షణకు మూడు దఫాలు ఉపాధ్యాయులు హాజరు అయ్యారని, అయితే ఎన్నికలకు ముందు ఆరోగ్య కారణాలతో కొందరు గైర్హాజరయ్యారన్నారు. వారిని సస్పెండ్ చేయడం తగదని, విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. దీనిపై డీఈఓ స్పందించి విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఇస్మాయిల్, మరియానందం, కె.తిమ్మప్ప, శ్రీనివాసరెడ్డి, సురేష్‌కుమార్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా కాలువలో పడి వ్యక్తి దుర్మరణం

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను గ్రామం వద్ద హంద్రీ-నీవా కాలువలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. బ్రాహ్మణకొట్కూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. దామగట్ల గ్రామానికి చెందిన కడ్డీల మధు (40) కొన్ని రోజులుగా మతిస్థిమితం లేక మద్యానికి బానిసై ఎటుపడితే అటు తిరిగే వాడు. గురువారం వడ్డెమాను గ్రామానికి వెళ్తూ హంద్రీనీవా కాలువలో నీరు తాగేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారిపడి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగార్జున తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

నాటుసారా బట్టీల ధ్వంసం



నాటు సారా బట్టీని ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ తండా, రామళ్లకోట గ్రామాల్లో నిర్వహిస్తున్న నాటు సారా బట్టీలను ధ్వంసం చేశామని సెబ్ సీఐ రామాంజనేయులు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 480 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేయడంతో పాటు, 25 లీటర్ల నాటుసారా, టీవీఎస్ ఎక్స్ఎల్ మోటార్ సైకిల్‌ను సీజ్ చేసినట్లు చెప్పారు. నిర్వాహకులు వడిత్య స్వామి నాయక్, మద్దిలేటి స్వామిని అరెస్ట్ చేసి పత్తికొండ కోర్టులో హాజరుపర్చామన్నారు. దాడుల్లో కర్నూలు స్క్వాడ్ ఎస్ఐ వీరస్వామి, సిబ్బంది హనుమంతు, శంకర్‌నాయక్, గోపాల్ నాయక్, వెంకట్రాముడు, బషీర్‌బాషా, కర్ణ పాల్గొన్నారు.

విద్యార్థులూ.. ఆల్ ది బెస్ట్

- నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం
- పది పరీక్షలకు 69, ఇంటర్‌కు 57 కేంద్రాల ఏర్పాటు
- రెండు సెషన్లలో ఇంటర్ పరీక్షలు
- పకడ్బందీ ఏర్పాట్లు చేసిన అధికారులు
- తరగతి గదుల్లో సీసీ కెమెరాలు, లైవ్‌స్ట్రీమ్ ద్వారా పర్యవేక్షణ



పరీక్షకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

కర్నూలు సిటీ: పబ్లిక్ పరీక్షల్లో అనుత్తీర్ణులైన టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు నేటి నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు. ఇంటర్ పరీక్షలు రెండు సెషన్లలో ఉదయం, మధ్యాహ్నం, టెన్త్ పరీక్షలు ఒక సెషన్‌లో ఉదయం మాత్రమే నిర్వహించనున్నారు. విద్యార్థులు నిర్దేశించిన సమయానికి పరీక్ష కేంద్రాలకు చేరుకునేందుకు ప్రజా రవాణా శాఖ ద్వారా బస్సులు అందుబాటులో ఉంచారు. కేంద్రాల్లో విద్యార్థులు తాగేందుకు మంచినీరు, పరీక్షలు రాసేందుకు గదుల్లో బెంచీలు సమకూర్చారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా టెన్త్, ఇంటర్ పరీక్షలు ఒకే రోజున ప్రారంభం కానుండడంతో పొరపాట్లకు అవకాశం లేకుండా విద్యాశాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు జిల్లాలో 57 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫస్ట్ ఇయర్ జనరల్ విభాగం నుంచి 15,076 మంది, వొకేషనల్ విభాగం నుంచి 905 మంది, సెకెండ్ ఇయర్ జనరల్ విభాగం నుంచి 6,194 మంది, వొకేషనల్ విభాగం నుంచి 768 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. అలాగే టెన్త్‌కు 69 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 17,458 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్మీడియెట్ బోర్డు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది. నేటి(శుక్రవారం)నుంచి జూన్ 1వ తేదీ వరకు ఈ పరీక్షలు జరుగనున్నాయి. ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు సెకెండ్ ఇయర్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు. ఆయా విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. జిల్లాలో 5 సమస్యాత్మకమైన కేంద్రాలను గుర్తించి అక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి కేంద్రంలో గది గదికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి పరీక్షలు జరుగనున్న తీరును జిల్లా, జోనల్, రాష్ట్ర స్థాయి కార్యాలయాల నుంచి అధికారులు పర్యవేక్షించనున్నారు. అలాగే ప్రతి కేంద్రం దగ్గర 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

గణితం పరీక్ష రాసే వారే అధికం.

పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నేటి నుంచి జూన్ 3వ తేదీ వరకు 69 కేంద్రాల్లో జరుగనున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. అయితే, గణితం సబ్జెక్టు రాసేందుకు అత్యధిక మంది పరీక్ష ఫీజు చెల్లించారు. తెలుగు సబ్జెక్టు 4231 మంది, హిందీ 11,51 మంది, ఇంగ్లిష్ 2107 మంది, గణితం 11,790 మంది, సైన్స్ 11,513 మంది, సోషల్ 7,843 మంది పరీక్షలు రాయనున్నారు.

మూడంచెల భద్రత



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): రాయలసీమ యూనివర్సిటీలో స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ జి.సృజన తెలిపారు. గురువారం విజయవాడ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కౌంటింగ్ ఏర్పాట్లపై అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో కౌంటింగ్ కోసం తీసుకుంటున్న చర్యలు, ఏర్పాట్లపై కలెక్టర్ వివరించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద 72 మంది సీఆర్‌పీఎఫ్, 70 మంది ఎస్ఏపీ, 391 మంది సివిల్ పోలీసులతో మూడంచెల భద్రతను కల్పిస్తున్నట్లు చెప్పారు. కౌంటింగ్ హాళ్ల బారికేడింగ్ పనులు చేపట్టడంతోపాటు వీవీప్యాట్ కౌంటింగ్ బూతులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. కౌంటింగ్ సిబ్బందిని 27న మొదటి ర్యాండమైజేషన్, జూన్ 3న నియోజకవర్గాలకు కేటాయించేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నట్లు చెప్పారు. ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

పేదల పాలిట ఆశాజ్యోతి వైఎస్ రాజారెడ్డి



రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ అధ్యక్షుడు బైజుబాబు

కర్నూలు(హాస్పిటల్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి వైఎస్ రాజారెడ్డి ఎంతో కృషి చేశారని, ఆయన పేదల పాలిట ఆశాజ్యోతి అని వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏఎన్ బైజుబాబు కొనియాడారు. గురువారం ఐటీసీ ఎదురుగా ఉన్న స్వామినగర్‌లో వైఎస్ రాజారెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజారెడ్డి 26వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక రోగులకు, కుష్టు వ్యాధిగ్రస్తులకు పండ్లు పంపిణీ చేశారు. బైజుబాబు మాట్లాడుతూ వైఎస్ రాజారెడ్డి కడప జిల్లాలో ఎంతో మంది నాయకులకు ఆయన రాజకీయ భిక్ష పెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో కిశోర్, వెంకటేష్, మస్తాన్, రవిగౌడ్, సూరి, హరున్, రవిరెడ్డి, వీరేష్, రాజు పాల్గొన్నారు.

స్కిజోఫ్రీనియా బాధితులపై ఆదరణ చూపాలి



డాక్టర్ కె.నాగిరెడ్డిని సన్మానిస్తున్న వైద్యులు, విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): స్కిజోఫ్రీనియా బాధితుల పట్ల ఆదరణ చూపాలని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ కె. నాగిరెడ్డి చెప్పారు. వరల్డ్ స్కిజోఫ్రీనియా డే సందర్భంగా గురువారం పెంచికలపాడులోని విశ్వభారతి మెడికల్ కాలేజీలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ స్కిజోఫ్రీనియా వ్యాధి లక్షణాలు, చికిత్స గురించి వివరించారు. ఇది ఒక వ్యక్తి ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తనలను ప్రభావితం చేసే మానసిక రుగ్మత అని చెప్పారు. దీనిపై వైద్యులు, వైద్య విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. చికిత్స అందించడంలో కుటుంబసభ్యుల పాత్ర కూడా ముఖ్యమని, ఈ విషయాన్ని రోగి కుటుంబసభ్యులతో చర్చించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మునీరుద్దీన్ అహ్మద్, సైకియాట్రి డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్లు, సైకియాట్రి పీజీలు, మెడికోలు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ చేయాలి

- డీటీసీకి ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ వినతి



డీటీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కర్నూలు:ప్రైవేట్ సంస్థల్లో డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇవ్వొచ్చనే కేంద్ర ప్రభుత్వ ఆలోచనను విరమించుకుని పాత పద్ధతిలోనే ఆర్టీఏ కార్యాలయాల్లో లైసెన్సులు జారీ చేయాలని కర్నూలు రవాణా శాఖ ఉప కమిషనర్ శ్రీధర్‌కు ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ వినతి పత్రం సమర్పించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ ఆ సంఘం నాయకులు గురువారం డీటీసీ శ్రీధర్‌ను కలిశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ, న్యూసిటీ అధ్యక్షుడు నరసింహులుతో పాటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. ప్రభాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ తదితరులు డీటీసీని కలిసిన వారిలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం రవాణా కార్యాలయాలను ప్రైవేట్ పరం చేసే విధంగా నిర్ణయం తీసుకుంటుందని, దాని వల్ల వాహనదారులు నష్టపోతారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న చలానా ధరలు విపరీతంగా పెరిగి అర్హత ఉన్న లైసెన్స్ పొందలేకపోతారని పేర్కొన్నారు. డ్రైవింగ్ స్కూళ్లకు లైసెన్సుల బాధ్యత ఇస్తే వారు ఇష్టారాజ్యంగా వ్యవహరించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు

రమణీయం.. చెన్నకేశవుని రథోత్సవం



అశేష జనసందోహం మధ్య చెన్నకేశవ స్వామి రథం ఊరేగింపు

ఓర్వకల్లు: మండల కేంద్రంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం రాత్రి ఆలయ ఈఓ మద్దిలేటి, ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రథోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ పురోహితులు నారాయణరావు, పవన్‌కుమార్‌శర్మ ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో ముస్తాబు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను జేసి భాజాభజంత్రీల మధ్య రథం వద్దకు తీసుకెళ్లారు. రథానికి రథాంగబలి, కుష్మాండబలి సమర్పించారు. భక్తుల గోవిందనామ స్మరణలతో స్వాముల వారి రథాన్ని ముందుకు కదిలించారు. రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లను తిలకించిన భక్తులు పరవసించిపోయారు. రథాన్ని రచ్చకట్ట వరకు తీసుకెళ్లి తిరిగి యథాస్థానానికి చేర్చారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న ఎద్దులు

కల్లూరు: పందిపాడు గ్రామ శివారులోని శివన్న తోట వద్ద పూల శంకరయ్య తాత ఆరాధన సందర్భంగా గురువారం నిర్వహించిన ఆరు పళ్ల ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. విజేత ఎద్దుల యాజమానులకు దాతలు కె.దేవేంద్రరెడ్డి, కె.భీమేశ్వరరెడ్డి, కె.ఉమమహేశ్వర రెడ్డి, పూల శంకర్, గొల్ల పెద్ద వెంకటస్వామి, శంకరయ్య స్వామి బహుమతులను ప్రదానం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాల వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. హైవే పోలీసులు తెలిపిన వివరాలు.. హైవేపై లారీ ఆగి ఉండడంతో వెనుక వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

కర్నూలు సిటీ: జేకే రూరల్ అర్బన్ ఎడ్యుకేషనల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఎన్‌జీఓ) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 10 రోజుల పాటు సెల్స్ రంగంలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఆ సొసైటీ అధ్యక్షుడు అహ్మదున్నీషా బేగం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి పాసై, 18 ఏళ్ల నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసక్తి ఉన్న వారు ఎంఆర్‌బీ ట్రేడ్ సెంటర్(బంగారుపేట)లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని, వివరాలకు 9642657140, 9885273327 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

పకడ్బందీగా ఓట్ల లెక్కింపు

- కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఆర్ఓ భార్గవ్‌తేజ
- ఆర్‌యూలో కౌంటింగ్ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలనలో పకడ్బందీగా జరుగుతుందని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం స్థానిక నగర శివారులోని రాయలసీమ యూనివర్సిటీలోని లైఫ్ సైన్సెస్ బ్లాక్‌లోని మూడవ అంతస్తులో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లను ఆర్ఓ పరిశీలించి సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం ఆర్ఓ మాట్లాడుతూ పారదర్శకంగా ఓట్ల లెక్కింపు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలు పాటిస్తూ పక్కాగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు, ఎన్నికల సిబ్బంది, ఏజెంట్లకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు, సౌకర్యాలు చేపట్టినట్లు చెప్పారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన :

ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రోజు వారి తనిఖీల్లో భాగంగా గురువారం కర్నూలు అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్‌రూమ్‌లను రిటర్నింగ్ అధికారి తనిఖీ చేశారు. పరిసరాలు, భద్రత ఏర్పాట్లు తనిఖీ చేసిన ఆర్ఓ అక్కడే ఉన్న లాగ్ బుక్స్‌లో సంతకాలు చేశారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు



చెంచు కాలనీ కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ నల్లప్ప

పాణ్యం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ నల్లప్ప హెచ్చరించారు. గురువారం స్థానిక చెంచు కాలనీలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తూ ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. విజయోత్సవ ర్యాలీలు, సంబరాలు చేసుకోరాదన్నారు. ఎస్ఐ అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలి



సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ రమేష్

- ఉద్యోగులతో బీఎస్ఎన్ఎల్ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి. రమేష్

కర్నూలు (న్యూటౌన్): భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) అభివృద్ధిలో ఉద్యోగులందరూ భాగస్వామ్యం కావాలని ఆ సంస్థ కర్నూలు బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి. రమేష్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక శ్రీనివాసనగర్‌లో ఈ10బీ టెలిఫోన్ ఎక్స్చేంజ్ కార్యాలయంలో ఆల్ ఇండియా గ్రాడ్యుయేట్ ఇంజినీర్స్ అండ్ టెలికాం ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏఐజీఈటీఓఏ) జిల్లా 4వ సర్వసభ్య సమావేశం సర్కిల్ ఉపాధ్యక్షుడు జాన్సన్ అధ్యక్షతన జరిగింది. స్థిరమైన అభివృద్ధి టెలికాం విప్లవంలో బీఎస్ఎన్ఎల్ పాత్ర అనే అంశంపై పలువురు నాయకులు, ఉద్యోగులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిజినెస్ ఏరియా జనరల్ మేనేజర్ జి. రమేష్ మాట్లాడుతూ టెలికాం వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఈ సమయంలో వినియోగదారుల నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ఉద్యోగులందరూ సమర్థవంతంగా, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. జూన్ నుంచి జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ ఎఫ్‌టీటీహెచ్‌లో కొత్త ప్లాన్లు వినియోగదారులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కాపర్ ద్వారా నడుస్తున్న ల్యాండ్‌లైన్ వాయిస్ ఇంటర్నెట్ సేవలను త్వరగా ఫైబర్‌లోకి మారుస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ డీజీఎం కె. రాజేశ్వర్ రావు, ఏపీ సర్కిల్ సెక్రటరీ ఎంవీ సత్యనారాయణ, సర్కిల్ ఉపాధ్యక్షుడు ఎస్‌కేఎన్‌వీకే సత్యనారాయణ, ఎస్ఎన్ఈఏ సెక్రటరీ శ్రీధర్, బీఎస్ఎన్ఎల్ ఈయూ సెక్రటరీ రామరాజు, ఎన్ఎఫ్‌టీయూ సెక్రటరీ ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆ శిశువు బరువు 900 గ్రాములు

- మెరుగైన వైద్యంతో ఆయువు పోసిన వైద్యులు



కోలుకున్న శిశువుతో వైద్యుల బృందం

కర్నూలు(హాస్పిటల్): సాధారణంగా 36 నుంచి 40 వారాల మధ్యలో మహిళ శిశువుకు జన్మనిస్తుంది. ఇలా జన్మించిన బిడ్డ మూడు నుంచి నాలుగు కిలోల బరువుతో పూర్తి ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉంది. కానీ ఓ మహిళ తన బిడ్డను 28 వారాలకే జన్మనిచ్చింది. అప్పుడు ఆ శిశువు బరువు 900 గ్రాములు మాత్రమే. పలు రకాల ఇన్‌ఫెక్షన్లు సోకి తీవ్ర అనారోగ్యం బారిన పడింది. ఇలాంటి శిశువుకు మెరుగైన వైద్యం అందించడంతో కోలుకున్నట్లు కర్నూలులోని మెడికవర్ ఆసుపత్రి నియోనెటాలజి కన్సల్టెంట్ డాక్టర్ సింధూర, పీడియాట్రిషన్ డాక్టర్ మురార్జీ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 'ప్రొద్దుటూరుకు చెందిన చందన గర్భం దాల్చిన 28 వారాలకే 900 గ్రాముల బరువున్న శిశువుకు జన్మనిచ్చింది. భారత దేశంలో ఒక శాతం పిల్లలు మాత్రమే 28 వారాల కంటే ముందుగా జన్మిస్తారు. శిశువు ఊపిరితిత్తులు, ఇతర అవయవాలు సరిగ్గా వృద్ధి చెందకుండా తీవ్రమైన ఇన్‌ఫెక్షన్లతో బాధపడుతోంది. రక్తస్రావం, బీపీ తగ్గిపోవడం వంటి సమస్యలతో ఆసుపత్రికి తీసుకొచ్చారు. శిశువును ఎన్ఐసీయులో ఉంచి చికిత్స చేశాం. ఊపిరితిత్తుల ఎదుగుదలకు సర్ఫెక్టెంట్ అనే మందును ఊపిరితిత్తుల్లో రెండుసార్లు అందించాం. ఇతర సమస్యలకు తగిన వైద్యం చేస్తూనే 11 రోజుల పాటు వెంటిలేటర్‌పైనే చికిత్స చేశాం. ఇలా నెలరోజుల చికిత్స తర్వాత సాధారణ దృష్టి, సాధారణ మెదడు పనితీరుతో శిశువు 1.3 కిలోల బరువుతో ఆరోగ్యకరమైన స్థితిలో డిశ్చార్జ్ అయ్యింది.'' అని వైద్యులు వివరించారు.

అన్నమయ్య కీర్తనలు అజరామరం

- గోదా గోకులంలో ఘనంగా అన్నమాచార్యుల జయంతి



అన్నమాచార్యుల చిత్ర పటం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



వేడుకల్లో గోదాగోకులం పరివారం, అన్నమయ్య ప్రాజెక్ట్ కళాకారులు

కర్నూలు కల్చరల్: అస్తిత్వానికి జీవం పోసిన అన్నమయ్య అందరికి ఆరాధ్యుడని ఆయన కీర్తనలు అజరామరం అని గోదా గోకులం వ్యవస్థాపక అధ్యక్షుడు మారాం నాగరాజుగుప్త అన్నారు. గురువారం నగర శివారులోని గోదా గోకులంలో తొలి తెలుగు వాగ్గేయకారుడు, పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనతరం అన్నమయ్య ప్రాజెక్ట్ జిల్లా కళాకారుల ఆధ్వర్యంలో అన్నమాచార్యుల సంకీర్తనల గానం, జీవిత చరిత్ర హరికథా గానం, నగర సంకీర్తన, అన్నమయ్య హరికీర్తన చందనం, అన్నమయ్య నృత్య నీరాజనం కార్యక్రమాలు అత్యంత ఆధ్యాత్మికంగా సాగాయి. కార్యక్రమంలో గోదా గోకులం సభ్యులు పాలాది సుబ్రహ్మణ్యం, పెరుమాళ్ల బాల సుధాకర్, వెంకట సుబ్రహ్మణ్యం, జనార్దన్, ఇటిక్యాల పుల్లయ్య, చిత్రాల వీరయ్య, ప్రకాష్, శ్రీనాథ్, వేముల రవి ప్రకాష్, అర్చకులు కిరణ్ భట్టర్, శేషాచార్యులు, లక్ష్మీనారాయణ ఆచార్యులు, మహేషాచార్యులు, వెంకటకృష్ణయ్య, రాము, రామయ్య, శేషయ్య, సంగీత అధ్యాపకులు సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు.